

దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, సర్పంచ్‌లు

# మాజీ సర్పంచ్‌ల అరెస్టు

- సెక్రెటరియేట్‌కు వెళ్తుండగా ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు
- పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఠాణాకు తరలించుడు ఎందుకని మండిపాటు



కుంటాల సర్పంచ్‌ను అడ్డుకున్న పోలీసులు



భైంసా రూరల్ పోలీసుల అదుపులో ఖత్గాం, హస్గుల్ సర్పంచ్‌లు

సోన్/భైంసా/కుంటాల/పెంబి/దిలావర్‌పూర్, ఫిబ్రవరి 4 : పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సెక్రెటరియేట్ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. నిర్మల్ జిల్లాలోని సోన్, భైంసా, కుంటాల, పెంబి, దిలావర్‌పూర్ మండలాలకు చెందిన వీరిని ఠాణాకు తరలించారు. సోన్ మండలంలో మాజీ సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల వినోద్‌కుమార్, సుంచు శ్రీనివాస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. భైంసా మండలంలోని ఖత్గాం, హస్గుల్ సర్పంచ్‌లు రాజు, ప్రకాశ్‌లను భైంసా రూరల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కుంటాల మండలంలోని పలువురు సర్పంచ్‌లను కూడా దిగ్బంధం చేశారు. పెంబి మండలంలో మాజీ సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, ఇటిక్యాల మాజీ సర్పంచ్ మహేందర్, కోశగుట్ట మాజీ సర్పంచ్ రాజులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. దిలావర్‌పూర్‌లో కూడా సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగం విరేశ్‌కుమార్, పలువురు తాజా మాజీ సర్పంచ్‌లను కూడా ఠాణాకు తరలించారు



పెంబి మండలంలోని మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు



సోన్ : ఠాణాలో మాజీ సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, సాకెర సర్పంచ్

## కేసీఆర్ సోదరి ద్వాదశ దినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి 4 : గులాబీ బాస్ కేసీఆర్ సోదరి సకలమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం హైదరాబాద్‌లోని కొంపల్లి చంద్రారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొన్నారు. సకలమ్మ చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరాం నాయక్ ఉన్నారు.



సకలమ్మ ద్వాదశ దిన కర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

నార్నూర్, ఫిబ్రవరి 4 : సమాఖ్య మహిళ సంఘాల సభ్యులు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఖైరదట్వా గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గిరిజన మోవా లడ్డు తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోవా లడ్డు తయారీ గురించి సంఘం సభ్యులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరా క్రాంతి పథకం(ఐకేపీ) ద్వారా కేంద్రం ఏర్పాటుకు రూ.3.50 లక్షలు మంజూరు చేశారు. మోవా లడ్డు మార్కెటింగ్ చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు అధికంగా రక్తహీనతతో బాధపడుతుంటారని, మోవా లడ్డు తినడం వల్ల పోషకాలు అందుతాయన్నారు. గర్భిణులు, కిశోర బాలికలు, పిల్లలు, పురుషుల్లో రక్తహీనత ఉంటుందన్నారు. నాణ్యమైన లడ్డూలు తయారు చేయాలని సూచించారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంక్ స్టోరేజీ యూనిట్ గదిలో పరికరాలు, ప్రసూతి వార్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జాడి రాజలింగం, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, అడిషనల్ ఏపీడీ గంగన్న, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, ఎంపీడీవో జవహర్‌లాల్, ఐకేపీ ఏపీఎం మైస రమేశ్ పాల్గొన్నారు.



నార్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

## చోరీకి పాల్పడుతున్న ఒకరి అరెస్టు

భైంసా, ఫిబ్రవరి 4 : భైంసా పట్టణంలోని దేవాలయాల్లో కొన్ని రోజులుగా వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి, సుమారు 3 కిలోల 150 గ్రాముల వెండి, 3 మాసాల బంగారాన్ని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నర్సింహానగర్‌లోని నర్సింహాస్వామి ఆలయం, పులేనగర్‌లోని హనుమాన్, నిర్మల్ రహదారిలో గల సంతోషిమాత, కైలాస్ ఫ్యాక్టరీలో గల బాలాజీ ఆలయంతోపాటు ఓ వైన్‌షాపులో కూడా దొంగతనానికి పాల్పడ్డాడు. ఇతను ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన విజయ్‌షిండే అలియాస్ అశోక్‌గా గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం అశోక్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బలరాంపూర్ గ్రామంలో ఉంటున్నాడు. ఓ ఆలయంలో సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించామని తెలిపారు. అంతేగాకుండా నిందితుడికి సహకరించిన అతని భార్య పూజ షిండే, వెండి వర్తకుడు పాండురంగ రామారావుపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

## కావాలనే తక్కువ చేసి చూపారు



కోటపల్లి, ఫిబ్రవరి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో పారదర్శకత లేదు. నామ మాత్రంగానే సర్వే నిర్వహించి బీసీ జనాభాను కావాలనే తక్కువ చేసి చూపారు. బీసీలకు అన్యాయం చేయాలని చూడడం సరికాదు. గతంలో తక్కువ సంఖ్యలో ఉన్న అగ్రవర్ణాల సంఖ్య పెరిగినప్పుడు.. బీసీల సంఖ్య ఎలా తగ్గుతుందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా మరోసారి కుల గణన చేపట్టి బీసీ జనాభాను ప్రకటించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ స్థానాలు పెంచి బీసీలను రాజకీయంగా ప్రోత్సహించాలి

*- బజ్జూరి వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి*

## బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారు



కోటపల్లి, ఫిబ్రవరి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో మొత్తం అసంపూర్తి సమాచారం ఉంది. అగ్ర వర్ణాల కులస్తుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే చేసినట్లు స్పష్టమవుతుంది. 100 శాతం సర్వే చేయకుండా నామామాత్రంగా సర్వే చేసి పూర్తయ్యిందని చెప్పడం దారుణం. ఈ ప్రభుత్వం అన్యాయం చేయాలని చూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరాల్సిందే. ఎమ్మెల్సీ టికెట్లు రెడ్ల కులస్తులకే కేటాయించి బీసీలను పక్కన పెట్టారంటే కాంగ్రెస్‌కు బీసీలపై ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు.

*- కొడిశెట్టి రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు*

## మళ్లీ సర్వే చేయాలి




చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వే సరిగా చేయలేదు. గతంలో ఉన్న బీసీల సంఖ్య కంటే ఇప్పుడున్న బీసీల సంఖ్య సుమారుగా 5 నుంచి 10 శాతం లోపు పెరగాలి. కానీ. ఈ సర్వేలో 5 శాతం బీసీల సంఖ్య తగ్గింది. మళ్లీ ప్రభుత్వం సక్రమంగా సర్వే చేయాలి. ప్రతీ కులానికి సమన్యాయం చేయాలి. ప్రభుత్వం చేసిన సర్వేను అందరూ తప్పుపడుతున్నారు.

*- మాదాసు మధూకర్. మున్నూర్ కాపు సంఘం మాజీ అధ్యక్షుడు. చెన్నూర్*



అయ్యో.. ఇవేం కులగణన లెక్కలు




# గజిబిజి.. గందరగోళం

## తప్పుల తడకగా కులగణన సర్వే లెక్కలు

- ఓ వైపు విమర్శలు వెల్లువెత్తుతుంటే.. దేశానికే దిక్సూచి అంటూ గొప్పలు
- 2014 సమగ్ర సర్వేలో జిల్లాల వివరాలు వెల్లడించిన కేసీఆర్ సర్కారు
- జిల్లా లెక్కలపై ఇప్పటికీ రాని స్పష్టత.. మండిపడుతున్న ఆయా వర్గాల ప్రజలు..
- 2014లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనాభా 28.24 లక్షలు
- కాంగ్రెస్ లెక్కల ప్రకారం పదేళ్లలో పెరిగిన జిల్లా జనాభా సగటున 2 వేల మందే..!

మంచిర్యాల, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన కులగణన సర్వే లెక్కలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనాభా వృద్ధి రేటు లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. కావాలనే సర్కారు బీసీ కులగణన లెక్కలను తక్కువ చేసి చూపించిందనే ఆయా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. 2014లో కేసీఆర్ సర్కారు నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 3.68 కోట్లు ఉన్న జనాభా 2024 రేవంత్ సర్కారు నిర్వహించిన సర్వేలో 3.70 కోట్లు మాత్రమే పెరిగింది. అంటే పదేళ్లలో రాష్ట్రంలో 2 లక్షల జనాభానే పెరిగింది. 2014 సర్వేలో బీసీ జనాభా 1,85,61,856 ఉంటే, ప్రస్తుత ఇంటింటి సర్వేలో 1,64,09,179 మంది బీసీలే ఉన్నారు. అంటే పదేళ్లలో బీసీ జనాభా 21,52,677 మంది తగ్గారు. ఇది ఎలా నమ్మశక్యం అవుతుదంటూ.. కేసీఆర్ చేసిన సర్వేనే సరైందంటూ.. రేవంత్ సర్కారు చేసిన సర్వే సరికాదంటూ బీసీ సంఘాల నాయకులు, లీడర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ఇలా విమర్శలు వెల్లువెత్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇది దేశానికే దిక్సూచి వంటి సర్వే అంటూ గొప్పలు చెప్పుకోవడంపై మండిపడుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో పదేళ్లలో పెరిగింది 2 వేల మందేనా..

రాష్ట్రంలో మొత్తం ఇంత మంది జనాభా ఉందని, ఇందులో బీసీలు ఇంత, ఎస్సీలు, ఎస్టీల జనాభా ఇంత ఉందని చెప్తున్న సర్కారు.. జిల్లాలవారీగా వివరాలు వెల్లడించలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానే తీసుకుంటే కేసీఆర్ సర్కారు సర్వే చేసినప్పుడు 2014లో 28,24,953 జనాభా ఉన్నారు. మరి ఇప్పుడు గడిచిన పదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం 2 లక్షల జనాభా పెరిగిందని సర్కారు చెప్తున్నది. ఈ లెక్కన గత పదేళ్లలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సగటున 2 వేల జనాభా మాత్రమే పెరిగినట్లు అవుతుంది. ఇది నమ్మ శక్యమైన పెరుగుదలేనా? జిల్లా మొత్తం పదేళ్లలో 2 వేల మందే పుట్టారని చెప్పే లెక్కల్లో నిజమెంతా? ఉమ్మడి జిల్లాలో గడిచిన పదేళ్లలో జననాలు ఏం జరగలేదా? కేవలం 2 వేల మందే పుట్టారా? ఈ లెక్కలను నమ్మేదెలా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.


### బీసీల ఆశలపై నీళ్లు


రాష్ట్రంలో బీసీ జనాభా 60 శాతం వరకు ఉంటుంది. జనాభా లెక్కలు చూసినా, వృద్ధిరేటు చూసుకున్నా ఈ 60 శాతం అనేది తగ్గేందుకు వీలు లేదన్నది బీసీల వాదన. రాజకీయం, ఆర్థికం, సామాజికంగా అన్ని రకాలుగా జనాభా తమాషాను అనుసరించి తాము ఎదగాలంటే 42 శాతం రిజర్వేషన్లు ఉండాలన్నది బీసీల చిరకాల వాంఛ. కానీ.. తాజాగా కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన గణాంకాలు బీసీల ఆశలపై నీళ్లు చల్లాయిజ వారి భవితవ్యంపై నిప్పులు పోశాయి. రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతమే ఉందని, ముస్లింలు మరో 10 శాతం ఉన్నారంటూ రేవంత్ సర్కారు కుండబద్దలు కొట్టడంపై బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఉన్న బీసీ లెక్కల్లో 21లక్షల మంది ఎందుకు తగ్గారు? ఇది కావాలని తగ్గించడం కాకపోతే ఇంకేంటని సర్కారును నిలదీస్తున్నారు. బీసీల జనాభా, రిజర్వేషన్ల అంశం తేలక ముందే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నారని, బీసీలను మరోసారి మోసం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. మరోసారి సర్వే చేసి బీసీల లెక్కలు తేల్చాలని, అప్పటివరకు రిజర్వేషన్లు ఖరారు చేయవద్దని డిమాండ్ చేస్తున్నారు.

### 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలు



సీఎం రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. లేని పక్షంలో ఆందోళన చేపడుతాం. బీసీ సర్వేలో కూడా బీసీల శా తాన్ని తక్కువగా చూపారు. బీసీలను మో సం చేసేందుకే ప్రభుత్వం కుట్ర పన్నుతున్న ది. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి. బీసీలను మోసం చేస్తే ఉద్యమం తప్పదు. *- రవీందర్, తలమడుగు*




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 8,16,948 కుటుంబాలు ఉండగా.. 28,24,953 జనాభా ఉన్నారు.

- కాంగ్రెస్ సర్కార్ చేసిన సర్వేలో జిల్లా జనాభా ఎంత ఉందనే వివరాలు వెల్లడించలేదు.

## పచ్చదనం పెంచేలా మొక్కలు నాటాలి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 4 : వనమహోత్సవంలో పచ్చదనం పెంపొందేలా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో వనమహోత్సవం-2025 కార్యక్రమ కార్యాచరణపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందేలా లక్ష్యం మేరకు మొక్కలు నాటి వాటిని రక్షించాలన్నారు. జిల్లా లక్ష్యం 69,55,300 మొక్కలు నాటే ప్రణాళికను రూపొందించామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వసతి గృహాలు, దేవాలయాల్లో మొక్కలు నాటాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా అటవీశాఖ అధికారి నాగినిభాను, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

### ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నోడల్ అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 16,809 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు, 1,944 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారన్నారు. 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీన పోలింగ్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు గోవింద్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సందీప్, దుర్గాప్రసాద్, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్‌రెడ్డి, గాజుల రవి, గంగ్రత్ రమేశ్, సిరికొండ రమేశ్, నరేశ్, అధికారులు పాల్గొన్నారు.

### గల్ఫ్ బాధితులకు హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు

గల్ఫ్ బాధితులకు సహాయాన్ని అందించేందుకు జిల్లాలో హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలలో చిక్కుకున్న బాధితుల కుటుంబ సభ్యులు 9398421883 నంబరును సంప్రదించాలన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కార్మిక శాఖ కార్యాలయంలో నేరుగా తమ ఫిర్యాదులను అందజేయవచ్చునని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

## డబుల్ బెడ్రూంలను స్వాధీనం చేయాలి

భైంసా, ఫిబ్రవరి 4 : భైంసా పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిందని, వెంటనే వాటిని అందించాలని లబ్ధిదారులు మంగళవారం డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్వాధీనం చేయలేదని, వెంటనే అందించాలని వారు కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు